విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం మండలంలోని నవాబ్ పాలెం, కొత్తూరు,దండకర్ర, పడాల, కరకట్ల రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం జిల్లా జాయింట కలెక్టరు జేవీ మురళి ఆకస్మిక తనిఖీలు జరిపి అధికార్లకు దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఏ విధంగా కొనుగోలు ప్రాసెస్ చేస్తున్నారు, ఏ విధంగా రైతులు పేర్లు నమోదు చేస్తున్నారు, ఏ విధంగా టోకెన్లు జారీ చేస్తున్నారు,తదితర వివరాలు పరిశీలించారు.అనంతరం కల్లాల్లో రైతులు ఎండబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి అందులో తేమ ఎంత శాతం ఉన్నదో పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఏ విధంగా కొనుగోలు చేసినట్లయితే రైతులకు లాభదాయకంగా ఉంటుందో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని రైతులు ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని అన్నారు. రైతులు ఎవరైనా హమాలీలు, రవాణా చార్జీలు పెట్టుకున్నట్లైతే ప్రభుత్వం నిబంధనల ప్రకారం వారి ఖాతాల్లోకి ఆ డబ్బులు జమ చేస్తారని జిల్లా జాయింటు కలెక్టరు తెలిపారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిస్టిక్ మేనేజర్ టి. శివరామ ప్రసాద్, డిఎస్ఓ యస్ సరోజ, వివిధ శాఖలు అధికారులు, రైతు భరోసా కేంద్ర సిబ్బంది , రైతులు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - తణుకు : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పౌరసరఫ రాల, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకు పట్టణం లోని 29వ వార్డు, సజ్జాపురం ఎల్ఐసి కార్యాలయం నుంచి 46వ రోజు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో మంత్రి పాల్గొని, వార్డులో ఉన్న ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు అమలు అవుతున్న విధానం పై ఆరా తీశారు. రహదారులు, త్రాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, తదితర అంశాలపై ప్రజలు మంత్రి వద్ద తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మంత్రి తక్షణమే స్పందించి పరిష్కారంకోసం సంభందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర -కైకలూరు : అనుకోని దుర్ఘటనలో ఇరువురు ప్రాణాలు కోల్పోవడం చాలా దురదుష్టకరం అని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. కైక లూరు పట్టణంలోని సిహెచ్సి హాస్పిటల్లో బుధవారం కైకలూరు మండలంలోని శీతనపల్లి గ్రామంలో పాత ఇంటి పనులు చేస్తుండగా ప్రమాదవ శాత్తు గోడకూలి కూలి పనులకు వెళ్లినవారు మరణించిన వారి కుటుంబాలను పరామర్శించారు.అనంతరం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకొని సంతాపం తెలిపారు. దగ్గర ఉండి డాక్టర్స్, పోలీస్ వారితో మాట్లాడి పంచనామా చేయించి మృతులను వారి స్వగ్రామం పంపించారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ సి అభివృద్ధి కమిటీ సభ్యులు దూలం శ్యామ్ ఫణి కుమార్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రాంబాబు,రూరల్ ఎస్ఐ చల్లా కృష్ణ, నాయకులు వీరగాని నాగమణి,కట్టావీరరాఘవులు,నారగాని హరి, అల్లూరి మంగారావు, వీరగాని ముసలయ్య,కట్టా విజయ్,ఉచ్చుల విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - భీమవరం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు వినియోగించుకొని క్రింది స్థాయి ప్రజలు అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ విముక్తి సంచార, సెమీ సంచార జాతుల అభివృద్ధి సంక్షేమ బోర్డు సభ్యులు తురక నరసింహ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో రాష్ట్రంలో సంచార జాతులు, విముక్తి కులాలకు ఎస్సి, ఎస్టి, బీసీ సంక్షేమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రింది స్థాయి ప్రజలు దేశంలో 17 కోట్ల మంది వరకు ఉన్నారని వారు అభివృద్ధి చెంది తేనే మన దేశం అభివృద్ధి చెందుతుందని వారి సంక్షేమం పట్టని వారు దేశద్రోహులతో సమానమ న్నారు. రాష్ట్రంలోని ఎస్ సి వసతిగృహాలు అన్ని కూడా గురుకుల పాఠశాలలుగా మార్చాలని దీనిపై ప్రభుత్వానికి మెమోరాడం ఇవ్వడం జరుగు తుందన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ,మహాత్మ జ్యోతిరావు పూలే, భారతమాత, వివేకానంద చిత్రపటాలకు బోర్డు సభ్యులు తురక నరసింహ పూల మాలలు వేసి, అంజలి ఘటించారు.ఈ సమావేశంలో ఇంచార్జి డి ఆర్ఓ దాసి రాజు, అడిషనల్ ఎస్పి సుబ్బరాజు, సమగ్ర శిక్ష ఏపీసి శ్యాంసుందర్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రజలందరూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలు వినియోగించు కోవాలని ఆ బ్యాంక్ చైర్మన్ టి. కామేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 8 జిల్లాల్లో 234 శాఖలతో విస్తరించి 27లక్షల ఖాతాదారులను కలిగి తెలిపారు. డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జిఎస్ఎన్ సతీష్ కుమార్, మేనేజర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాసా ప్రాజెక్టులో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలూరు : నాసా ప్రాజెక్టులో స్థానిక బాలాజీ నగర్‌లో గల 14 మంది శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథి లోవరాజు, స్కూల్ అసిస్టెంట్ చేతుల మీదుగా ఎంపికైన 14 మంది విద్యార్థులకు బహుమతులను, కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి అంశాల పట్ల మాత్రమే కాకుండా సృజనాత్మక అంశాలలో పాల్గొనడం వలన కూడా ప్రతిభను వెలికి తీయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ గో బ్యాక్

వామపక్ష పార్టీలు

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన ప్రధాని మోదీ గో బ్యాక్ అంటూ నేడు, రేపు నిరసన ప్రదర్శనలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. స్థానిక ఆర్ఆర్ పేట సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో వామపక్ష పార్టీలు,సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఎంసిపిఐ పార్టీల సమావేశం జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా,విభజన హామీలు అమలు చేయకుండా, ఆంధ్రుల హక్కయిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేస్తున్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని నాయకులు విమర్శించారు. కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తామని, విభజన హామీలు అమలు చేయిస్తామని, ప్రగాల్భాలు పలికిన రాష్ట్ర వైసీపీ ప్రభుత్వం నేడు ఏ హామీ అమలు చేయని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి మోకరిల్లుతూ ప్రధానమంత్రి పర్యటనకు జన సమీకరణను నిస్సిగ్గుగా చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన హక్కులన్నీ సాధించాలని, ఆ తర్వాతే ప్రధానమంత్రిని ఈ రాష్ట్రంలోకి ఆహ్వానించాలని, లేనిపక్షంలో ప్రజలందరినీ సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు. వెంకటేశ్వరరావు, సీపీఎం ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు పళ్ళెం కిషోర్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు పాల్గొన్నారు.

సీపీఐ, సీపీఎం నిరసన ప్రదర్శనలు

విశాలాంధ్ర- పెంటపాడు : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు పూను కుంటూ పదే పదే రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెడుతున్న ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటనకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ఇచ్చిన రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం పెంటపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు.ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా నిధులు ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు,కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు, గంగవరం పోర్టు,రెవెన్యూ లోటు భర్తీకి నిధులు లాంటి విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న మోడీకి రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు లేదన్నారు.ఏపి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి వుంటే ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుకు, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని విశాఖ పర్యటనలో ప్రకటించాలని భీమారావు డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో సీపీఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, పార్టీ నాయకులు వంక అప్పారావు, బి.లక్ష్మినారాయణ, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావు స్మారక స్థూపం నిర్మాణానికి ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - పెంటపాడు : ప్రజా సమస్యల పరిష్కారానికి,పేద వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన సీపీఐ నాయ కులు కొల్లి వెంకట్రావు స్మారక స్థూపం నిర్మాణానికి పెంటపాడు గ్రామ ప్రజ లందరూ సహకరించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు.గురువారం పెంటపాడు లో కొల్లి వెంకట్రావు స్మారక స్థూపం నిర్మాణానికి భీమారావు శంకుస్థాపన చేసి మాట్లాడారు.గ్రామంలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పనకు వెంకట్రావు ఎనలేని కృషి చేశారన్నారు. సీపీఐ పెంటపాడు మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ పెంటపాడు గ్రామంలో పేదలకు ఇళ్ళ స్థలాలు, రోడ్లు, డ్రైనులు, గుడి, బడి, పార్కు,శ్మశాన వాటిక లాంటి అభివృద్ధి కార్యక్రమాలు ఏర్పాటుకు వెంకట్రావు అంకితభావంతో పనిచేశారన్నారు. ఏఐటీయూసీ నాయకులు డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, సీపీఎం పెంటపాడు మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి,సిరిపురపు రంగారావు, సీపీఐ నాయకులు వంక అప్పారావు, బి.లక్ష్మినారాయణ, దిద్దే నాగేశ్వరరావు, కొణతల నాగరాజు, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాలతో సంబంధం లేకుండా జూట్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

విశాలాంధ్ర- ఏలూరు : కార్మిక సంఘాలతో ఒప్పందం లేకుండా, అధికారులతో సంబంధం లేకుండా ఏలూరు జూట్ మిల్ యాజ మాన్యం ఏకపక్షంగా అనుసరిస్తున్న అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్ ను నివారించాలని కోరుతూ 5 కార్మిక సంఘాలు ఇచ్చిన విజ్ఞప్తి మేరకు జేసీఎల్ ఎ. రాణి గురువారం యాజమాన్యానికి- కార్మిక సంఘాలకు మధ్య సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అన్ని యూనియన్ల నాయకులు మాట్లాడుతూ 2021- 22 సంవత్సరానికి సంబంధించిన బోనస్ యాజ మాన్యం చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నదనీ, రాజీనామా చేసిన వారికి మాత్రమే బోనస్ ఇస్తానని బ్లాక్ మెయిల్ చేస్తున్నదని సంఘాలు తెలియజేశాయి. జేసీఎల్ స్పందిస్తూ ఇది సరైనది కాదనీ, రాజీనామాలతో సంబంధం లేకుండానే కార్మికులందరికీ బోనస్ చెల్లించాలని సూచించారు. కార్మిక సంఘాలతో చర్చించి ఒప్పందం చేసుకోవాలని, లేకుంటే తాము చట్ట ప్రకారం వెళతామని యాజమాన్యా నికి తెలియజేశారు. కార్మికులకు ప్రస్తుతం చెల్లిస్తున్న పరిహారాన్ని అదనంగా ఇచ్చేలా చూడాలని ఆమె తెలియ జేశారు. యాజమాన్యంతో చర్చించి ఈ విషయాన్ని తెలియజేస్తామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. తిరిగి నవంబర్ 18తేదీకి సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఏఐటీయుసి జిల్లా ఉపాధ్యక్షులు నాయకులు బండి వెంకటే శ్వరరావు, ఐ.ఎఫ్.టి.యు. నాయకులు కె. పోలారి, కాకర్ల అప్పారావు, యు.వి., టి.ఎన్.టి.సి నాయకులు కోలపల్లి ఉమాశంకర్, కె.వి వెంకటేశ్వర రావు, సిఐటీయు నాయకులు బి.జగన్నాథ రావు, వి. సాయి బాబా, ఐ.ఎన్. టి.యు.సి. నాయకులు పులి శ్రీరాములు, ప్రసాదు, హాజరవ్వగా యాజమాన్య ప్రతినిధులు పర్సనల్ మేనేజర్ ఎం. ఎన్. వి. సురేష్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ హరిబాబు హాజరయ్యారు.

భవననిర్మాణ కార్మికుల చలో రాజమండ్రి జయప్రదం చేయండి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అఖిలభారత భవననిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. సోమసుందర్ పిలుపు ఇచ్చారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ , వడ్రంగి, సెంటరింగ్ ,రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ మేస్త్రీల సమావేశం గురువారం సిపాయి పేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో ఏరియా కమిటీ అధ్యక్షులు పడాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సోమసుందర్ మాట్లాడుతూ పార్లమెంటు ఆమోదం ద్వారా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వెల్ఫేర్ బోర్డు చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డును పటిష్ట పరచి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ అధ్యక్షులు పడాల శ్రీనివాస్ మాట్లాడుతూ నవంబర్ 26 న రాజమండ్రిలో జరగనున్న జాతీయ మహాసభల ప్రారంభసభకు పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని కోరారు. రాజమండ్రి ర్యాలీని దృష్టిలో ఉంచుకుని ఈసారి నెలవారీ సెలవును డిసెంబర్ 1 వ తేదీకి బదులుగా నవంబర్ 26 వ తేదీనే వినియో గించుకోవాలని, డిసెంబర్ 1వ తేదీన పనిదినంగా పరిగణించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికసంఘాల సమాఖ్య జాతీయ 7 వ మహాసభలు డిసెంబర్ 26 27 28 తేదీలలో జరుగుతున్నాయని భవననిర్మాణ కార్మికోద్యమంలో ఈ మహాసభలకు చాలా ప్రాముఖ్యం ఉందని తెలిపారు. జిల్లా భవననిర్మాణ కార్మికసంఘం కోశాధికారి మెండెం జేమ్స్ మాట్లాడుతూ గత మూడేళ్ళుగా రాష్ట్రంలో ప్రభుత్వ విధానాల వల్ల భవననిర్మాణ కార్మికవర్గం అష్టకష్టాలు పడుతూ వచ్చిందన్నారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని తద్వారా సమస్యలు పరిష్కారం అవుతా యని అన్నారు. ఏరియాకమిటీ ప్రధానకార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ జాతీయ మహాసభల సందర్భంగా కార్మిక సమస్యలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ సీనియర్ నాయకులు రౌతు శ్రీనివాసరావు, కాకర్ల రాంబాబు, మాదు శ్రీనివాస్, దూలం ఆనంద్, కామిరెడ్డి సత్యనారాయణ, రామిసెట్టి సత్తిబాబు, కోడె సాయి బాలాజీ, పిల్లంగోళ్ళ కృష్ణ తదితరులు మాట్లాడారు.

ప్రతిభ గల విద్యార్థినులకు ఎన్టీఆర్ ట్రస్ట్ స్కాలర్‌షిప్ పరీక్ష

విశాలాంధ్ర - ఏలూరు : ఎన్.టి.ఆర్ విద్యా సంస్థలు గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతిభగల విద్యార్థినులకు స్కాలర్షిప్ పరీక్ష డిసెంబర్ 4న నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఎన్ టి ఆర్ విద్యాసంస్థల ద్వారా ఉపకార వేతనం అందజేస్తామని తెలిపారు. మొదటి పది ర్యాంకులు పొందిన బాలికలకు నెలకు రూ.5 వేలు, తరువాత 15 ర్యాంకులు పొందిన బాలికలకు నెలకు రూ.3 వేల చొప్పున ఎన్.టి.ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసే వరకు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి చదువుతున్న బాలికలందరూ వినియోగించు కోవాలని కోరారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 766000 2627,7660002628 నంబర్లకు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

జడ్పీహెచ్ స్కూల్లో డిప్యూటీ విద్యాశాఖ అధికారి తనిఖీ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : నూజివీడు డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఎం. సేవ్య గురువారం ఆకస్మికంగా ఆగిరిపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

స్కూలుకు సంబంధించిన, కొన్ని రికార్డులను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ ఇచ్చి,ఫైనల్ పరీక్షలకు చదువుకునే విధానం ,పరీక్ష రాసే విధానం, సమయాన్ని వాడుకునే విధానం తెలియజేశారు. కార్యక్రమంలో ఆగిరిపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పుష్పలత తెలిపారు .

పాసుపోర్టు పోయినది

తొత్తరమూడి బాలు, S/o. జక్కరయ్య, D.No:2-1 15, చర్చి వద్ద, నర్సింహపురం (గ్రా), భీమవరం (మం), ప"గో"జిల్లా., పిన్:534202. సెల్ నెం: 6305097210. **ది.02-11-2022వ తేదీన ఉదయం 10 గం.లకు** మా స్వగ్రామం నర్సింహ పురం నుండి మా గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామి దేవాలయం వైపు మోటార్ సైకిల్ పై వెళ్తు చుండగా పాలిథిన్ కవరులోని నా యొక్క ఒరిజినల్ పాసుపోర్టు నెం.**S5315221** పోయినది. మార్గం మధ్యలో ఎంత వెతికినా నా యొక్క ఒరిజినల్ పాసు పోర్టు కనిపించలేదు. దయచేసి నా యొక్క ఒరిజినల్ పాసుపోర్టు దొరికిన వారు క్రింద అడ్రసులో అందచేయగలరు.

తొత్తరమూడి బాలు, S/o. జక్కరయ్య,
D.No:2-115, చర్చి వద్ద, నర్సింహపురం(గ్రా),
భీమవరం (మం), ప"గో"జిల్లా.,
పిన్:534202.
సెల్ నెం:6305097210.

పందేలకు ఏర్పాట్లు

-ఒప్పందాలు చేసుకున్న నిర్వాహకులు

- కోతముక్క గుండాటలు ఆపించండి

విశాలాంధ్ర - లింగపాలెం : కోడి పందేలకు ప్రసిద్ధిగాంచిన లింగపాలెం మండలంలో ఇప్పటి నుంచే పందేల నిర్వహణకు చకచకా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జరుగుతున్న ఏర్పాట్లను చూస్తే ఈ ఏడాది లింగపాలెం మండలంలో సంక్రాంతికి భారీ పందేలు ఉంటాయనే హుషారులో పందెం రాయుళ్లు ఉన్నారు. నిర్వాహకులు పందేలకు పుంజులను సిద్ధం చేస్తున్నారు. వీటికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. మండలంలో వెయ్యికిపైగా పుంజులకు శిక్షణ ఇవ్వటం విశేషం. మండలంలో ములగలంపాడు, కలరాయనగూడెం, శింగ గూడెంలో ప్రతీ ఏటా పందేలు భారీగా వేస్తారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పందేలు నిర్వహించే వారి సంఖ్య పెరుగుతోంది.

ఒట్టి మాటలే : పందేలు జరగనివ్వం.. ఈసారి కఠినంగా ఉంటాం, కోర్టు ఆదేశాలను అమలు చేస్తామంటూ అధికారులు, పోలీసులు హెచ్చరిస్తూ చివరి సమయంలో చేతులెత్తేసి అనుమతులు ఇస్తుండటంతో ఈసారి వీరి మాటలు బేఖాతర్ చేస్తూ పందేల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ, బెంగళూరు, ముంబై, చెన్నైలలో ఉన్న పందేగాళ్ళకు ఆహ్వానాలు వెళ్ళాయి. వారికి బస ఏర్పాట్లను ఇప్పటి నుంచే చూస్తున్నారు.

కోతముక్క, గుండాటలు ఆపించండి : పందే లలో నిర్వహించే కోతముక్క, గుండాటలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు. వీటిని నిర్వహించే వారు గూండాయిజంలో దొంగాటలు ఆడి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఏడాదంతా కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో కోతముక్క, గుండాట లలో పోగొట్టుకుని అప్పుల పాలవు తున్నారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆటలను అరికట్టించేందుకు ఉద్యమించాలని గ్రామాలలో పలువురు ఈసారి సంఘాలుగా ఏర్పడేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పేరు మార్పు

కటూరి మేరి భర్త మోషేను హరిజనపేట బావాయిపాలెం క్రొవ్విడి పశ్చిమగోదావరి జిల్లా అను నేను నా పాస్‌పోర్టులో **దత్తాడ చిట్టెమ్మ** అని ఉన్నది. నా ఆధార్ కార్డులో **కటూరి మేరిగా** ఉన్నది. నా పేరు కటూరి మేరీగా పేరు మార్చుకోవడం జరిగింది. పాస్ పోర్టు నెం: **K79 19318** నా ఆధార్ నెం: **9709 2161 2777.** ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయగలరు.

కటూరి మేరీ భర్త మోషేను
హరిజనపేట, బావాయిపాలెం
క్రొవ్విడి, పశ్చిమగోదావరి జిల్లా
సెల్ నెం:6305438783

13న బికెఎంయు రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర - ఏలూరు : ఈనెల 13వ తేదీన విజయవాడలో బికెఎంయు రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు రాష్ట్ర ఆఫీసు బేరర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం ఉదయం గం.11 లకు జరుగుతుందని బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో భూ సమస్యలు, వన సంరక్షణ సమితులు, ఉపాధి హామీ పథకం అమలు, సంఘ నిర్మాణం, ఎస్‌సి,ఎస్‌టి, సబ్ ప్లాన్ చట్టం, దళితులపై దాడులు తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.

రైతులు ఆక్రమించుకున్న కాల్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో ఆక్రమణకు గురైన య.14.90 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి, కాల్వ భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కాల్వ భూములను మినహాయించి, పోరంబోకు భూములను తిమ్మారావు గూడెంనకు చెందిన భూమిలేని దళితులకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా ఆర్.ఎస్ నెంబర్లు 711,714,718,720,723/1 లలో 14 ఎకరాల 90 సెంట్లు ప్రభుత్వ పోరం బోకు భూమి, కాల్వ భూములను కొంతమంది ధనిక రైతులు తమ భూములలో కలుపుకొని చేపల చెరువులుగా మార్చి ఫల సాయం పొందుతున్నారని పేర్కొ న్నారు. పై సర్వే నెంబర్లలోని 14 ఎకరాల 90 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి, కాల్వ భూమి ఆక్రమణకు గురైందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం చాటపర్రు గ్రామ కార్యదర్శి బుగ్గల ప్రభాకర్ 2022 మార్చి నెలలో స్పందనలో ఫిర్యాదు చేశాడని తెలిపారు. స్పందనలో ఫిర్యాదు చేసిన ప్రభాకర్ కు హాని చేయడానికి ఆక్రమణ దారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభాకర్ కు ఏ విధమైన హాని జరిగినా ఆక్రమణ రైతులే బాధ్యత వహించవలసి ఉంటుందని పేర్కొన్నారు.

13న పాలకొల్లులో మోకులతో కృతజ్ఞతా యాత్ర

విశాలాంధ్ర - పాలకొల్లు: ముఖ్య మంత్రి జగన్ కల్లుగీత కార్మికులకు వరాల వర్షం కురిపించిన సంద ర్భంగా కృతజ్ఞతతో గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, శ్రీశైన, యాత కుల స్తులంతా ఈనెల 13వతేదీ ఆదివారం ఉదయం గం.10లకు మోకులతో భారీ ఎత్తున నిర్వహించే ప్రదర్శనకు తప్పక హాజరు కావా లని బహుజన కులాల నాయకులు చింతపల్లి గురుప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్యఅతిథిగా మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య హాజరవు తారని తెలిపారు. మోకులు ధరించి కదం తొక్కుతూ పదం పాడుతూ సాగే చైతన్య యాత్రలో అందరూ పాల్గొనవలసిందిగా కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం అని ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ అన్నారు. మండలంలోని చిగురుకోట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం 100వ రోజు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో పాటు ఎంపీ శ్రీధర్ పాల్గొని ఎంపీపీ రామిశెట్టి అధ్యక్షతన కేక్ కట్ చేసి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ పార్టీ విజయానికి కార్యకర్తలు ప్రాముఖ్యమని వారిలో విశ్వాసాన్ని పెంచే విధంగా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరు శ్రీదేవి, జడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ పేరం నాగలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు , కోమటి విష్ణువర్ధన్, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత , రాసూరి రాధ, బొర్రా శేషుబాబు, శీలం రామకృష్ణ, కరేటి గోవిందరాజులు, నిమ్మగడ్డ బిక్షాలు, నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు , పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - నిడమర్రు : మానవత సేవా సంస్థ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఉంగు టూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీని వాసరావు సోదరుడు పుప్పాల కన్న బాబు అన్నారు. గురువారం మానవత నిడమర్రు మండల శాఖ ఆధ్వర్యంలో విజయవాడ డాక్టర్ వైవిరావు సహకారంతో ఉచిత గుండె పరీక్ష శిబిరాన్ని బువ్వనపల్లి గ్రామ యూపీ స్కూల్‌లో నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 60 మందికి గుండె పరీక్షలు చేయగా అందులో 27 మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం విజయవాడ పంపినట్లు మానవత మండల అధ్యక్షులు కాన్వెంట్ శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల చైర్మన్ సంకు సత్య కుమార్, జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశీ, మానవత జిల్లా మాజీ అధ్యక్షులు సాగిరాజు జానకిరామరాజు, కె. విశ్వనాథరాజు, ఎం. చిన్న అప్పారావు, సంకు పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్గం

విశాలాంధ్ర - పోడూరు : మండలంలోని వేడంగి యస్‌సి పేటలో రావి రామకృష్ణకు చెందిన ఇల్లు గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. ఈ ప్రమాదం లో ప్రాణహాని సంభవించ లేదు. ఇంట్లో ఉన్న మంచాలు, కుర్చీలు, లెదర్ సూట్ కేస్ లు వంటి ఫర్నిచర్ కాలిపోయాయి. గదిలో మంచం మీద నిద్రిస్తున్న ఇద్దరు చిన్న పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్ ఛార్జ్ కవురు శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, 25 కేజీల బియ్యం, రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఎంపీపీ నబ్బితి సుమంగళి, మండల కన్వీనర్ గణపతి రాజు, డిటిడిసి బాబు, పేద్ర అంజి బాబు, కొట్టి రామారావు, పెందుర్తి చరణ్, పాలపర్తి రాము, చిట్టిబాబు, నల్లి వెంకటేశ్వరరావు, మండల, గ్రామ పార్టీ నాయకులు జడ్పీ చైర్మన్ వెంట ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన

విశాలాంధ్ర - నిడమర్రు : రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఉంగుటూరు శాసన సభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిడమర్రు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మనబడి- నాడు నేడు ఫేజ్-1 భాగంగా రూ.80 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు తరగతులు ప్రారంభోత్సవం, నాడు నేడు ఫేజ్ -2 లో రూ. 25 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న అదనపు గదులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందుకే మన బడి నాడు నేడు పథకాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశీ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర -పెంటపాడు : మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జాయింట్ కలెక్టర్ జెసి మురళితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో వివరాలు పరిశీలించారు. అనంతరం కల్లాల్లో రైతులు ఎండబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి అందులో తేమ ఎంత శాతం ఉన్నదో పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు, ఎన్ని ఎకరాల లో పంట వేశారు, ఎప్పుడు కోతకోసారు , ఎప్పుడు ఇక్కడికి ధాన్యం తెచ్చారు ,ఎంత దిగుబడి వచ్చింది. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టర్ జె.వి. మురళి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, పెంటపాడు తహసీల్దార్, ఎంపిడిఓ, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక ఉప్పర పేటకు చెందిన 28 మంది ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోగా వారి పట్టాలను అధికారులకు అందజేశామని, ఇప్పుడు పట్టాలు ఇవ్వమని అడుగుతుంటే సమాధానం లేదని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన క్రమంలో ఉప్పరపేటలో నివసిస్తున్న గ్రామస్తులు పట్టాలు ఇప్పించాలని విషయాన్ని తెల్లం బాలరాజుకు తెలియజేయగా ఆయన ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు సంకు కొండలరావు తహసీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ పి .నాగమణికి వినతి పత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు అందజేస్తామని పేర్కొన్నారు.

తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లా ప్రభుత్వ బోధన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో 12 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బి.వి, కృష్ణారెడ్డి తెలిపారు.

తల సేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 30 మందికి ఉచిత భోజనం వలసపల్లి ప్రమీల జ్ఞాపకార్థం వారి భర్త వి.ఆర్.వి సత్యనారాయణ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ జి.చైతన్య కిరణ్, ఏ.సూర్యనారాయణ,కె.వి రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర- ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ భవనాలు వెంటనే పూర్తి చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. గురు వారం మండలకేంద్రమైన ముసునూరు రెవెన్యూ కార్యాలయంలో

తహశీల్దార్ దాసరి సుధ, ఎంపీడీవో బసవరాజు అచ్యుతసత్య నారాయణలతో పాటు పంచా యతీరాజ్ ఏఇ,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్‌లను ఎంత వరకు పూర్తయ్యాయి, ఏయే భవనాలు ఏ దశలోవున్నాయో వివరాలు అడిగారు. అనంతరం కాట్రేనిపాడులో స్థలవివాదం పరిశీలించడానికివెళ్లారు.

వికలాంగులకు చేయూత

విశాలాంధ్ర - యలమంచిలి : యలమంచిలి మానసిక వికలాంగుల కేంద్రంలో శ్రీ క్షీరపుర అన్నదాన సమాజం ఆధ్వర్యంలో వికలాంగులకు రూ.40 వేల విలువగల సైకిల్, స్టిమిలేటర్ మోటర్, ఎయిర్ బ్యాగ్స్, లను జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా

అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, చివటపు నాగేశ్వరరావు, అన్నదాన సమాజం ఈఓ ఏవీవీ సత్యనారాయణ, చైర్మన్ మామిడి బాబు తదితరులు పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్ కు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్ లోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరానికి 'నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్' కు తమ ప్రాజెక్టు వర్క్ పూర్తి చేసి పంపిం చారు. ఈ సందర్భంగా

ఏర్పాటు చేసిన అభినందన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక సెయింట్ థెరీసా పీజీ కళాశాల భౌతిక శాస్త్ర ఆచార్యురాలు డా. ఎ. నిర్మల జ్యోత్స్న మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఉత్సుకత, సృజనాత్మకత, సామాజిక బాధ్యత, ఆరోగ్యకరమైన పోటీ తత్వం, నిరంతర అభ్యాసం అలవర్చుకోవాలన్నారు.ప్రపంచ స్థితిగతులను మార్చిన అనేక గొప్ప శాస్త్రవేత్తల సేవలను కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివ కుమారి మాట్లాడుతూ విద్యార్థుల తార్కిక ఆలోచనలతో దేశ భవిష్యత్తు ముడిపడి ఉన్నదన్నారు. నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రాజెక్టుకు సంబంధించిన నమూనాను అందజేస్తూ వారిలో ఉత్తేజాన్ని నింపేందుకు నాసా టీషర్టు, బుక్స్, నాసా బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్‌చార్జి పార్థసారథి, ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయభాస్కర్ సభలో పాల్గొని ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సభలో ఎకడమిక్ డీన్ జె.సంజీవ్ కుమార్, నాసా ఇన్‌చార్జి ఎ. నారాయణ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాల్లో చేయూత మహిళా మార్ట్ లు ఏర్పాటుకు ప్రాధాన్యత నివ్వాలని పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం ఉపాధిహామీ, జల్ జీవన్ మిషన్, పి.ఎం.జి.ఎస్.వై, సెర్ప్ తదితర అంశాలపై తాడేపల్లి నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంటి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ , జెడ్పి సిఇఓ రవికుమార్, డ్వామా పిడి డి. రాంబాబు, డిఆర్డిఏ పిడి విజయరాజు, డిపిఓ ఎన్. బాలాజి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ జిల్లాలోని మహిళా సంఘాల ద్వారా తొలి దశలో ప్రతి మండలంలో రెండు చొప్పున మహిళా మార్టులను ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తరువాత దశలో జిల్లావ్యాప్తంగా 500 నుండి 600 మహిళా మార్టులను ఏర్పాటుచేసి మహిళా సంఘ సభ్యులకు సుస్థిర ఆదాయం వచ్చేలా కృషిచేయాల న్నారు. కనీసం రూ. 5వేల నుండి 6వేల మంది సభ్యులకు ఉపాధి కలిగేలా చూడాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులను మహిళా సంఘాల ద్వారా విక్రయిస్తే మరింత ఆదాయం లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బల్క్ మిల్క్ యూనిట్స్ వీలైనంత త్వరగా పూర్తిచేస్తే పాలను అమూల్ సంస్థ తీసుకునేందుకు సిద్ధంగా ఉందని, తద్వారా ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

రైతులకు అండగా ఉండాలి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : సకాలంలో ధాన్యం కొనుగోలు పక్రియను పూర్తి చేసి రైతులకు అండగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ఎంత ముఖ్యమో, సకాలంలో కొనుగోలు ప్రక్రియను పూర్తిచేసి రైతులకు భరోసా కల్పించడం అంతే ముఖ్యమన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు ధాన్యం కొనుగోలును పర్యవేక్షణతో పాటు, వరి కల్లాలోనికి వెళ్లి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వీటి పర్యవేక్షణకు జిల్లాలోని 35 మంది డిప్యూటీ తహసీల్దార్లకు విధులను కేటాయించామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ కుమారి డి.అఖిల, డీఎస్ఓ ఎన్.సరోజ, తాడేపల్లిగూడెం మునిసిపల్ కమిషనర్ బి.బాల స్వామి, తహసీల్దార్ వైకెవి అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - చాట్రాయి : ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ అర్షత్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం మండలంలోని చనుబండ గ్రామంలో 1,2 సచివాలయాల పరిధిలో నిర్మాణంలో వున్న రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. వర్క్ ఇస్ వెరీ గుడ్ అంటూ అభినందించారు.తహశీల్దార్ విశ్వనాథరావు ఎంపిడిఓ మురళీమోహన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో చనుబండ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి వైసీపీ మండల నాయకులువనమా వాసు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదులు పరిష్కరించండి

చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన సబ్ కలెక్టర్ స్పందనలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ విశ్వనాధరావు,ఎంపిడిఓ మురళీమోహన్ ఎఇ శివశంకర్ లను ప్రభుత్వ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు.



51 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో సార్వ పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభింపచేసిన అధికారు లు గురువారం నాటికి 51 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపించారు. ఉదయం నుంచి జెసి అరుణ్ బాబు, ఏలూరు ఆర్డీవో పెంచల్ కిషోర్ నారాయణపురం విశాల పరపతి సొసైటీ, ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాల వద్దే తిష్టవేశారు. జిల్లా అధికారులు దగ్గరుండి రైతుల నుంచి శాంపిల్స్ సేకరణ, తేమ శాతం పరీక్షలు, సంచులు ఇవ్వడం, ట్రక్కు షీటు విడుదల చేయడం వంటి శాఖాపరమైన ప్రక్రియలను పూర్తి చేశారు. ఎట్ట కేలకు ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం నుంచి 51 టన్నుల ధాన్యం ను గణపవరం, భీమడోలు రైస్ మిల్లులకు పంపించారు. నారాయణపురం సొసైటీల్లో రైతులను ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ నిరంతరం సంచులు అందుబాటులో ఉంచామని రైతులు ఎలాంటి ఆందో ళన చెందనవసరం లేదన్నారు. హమాలీ ఛార్జీలు, రవాణా కిరాయిలు సైతం ధాన్యం బిల్లులతో పాటు 21 రోజుల్లో చెల్లించేలా అన్ని చర్యలు తీసుకున్నామని జేసీ అరుణ్ బాబు తెలిపారు.

కుష్టువ్యాధి రహితంగా జిల్లా

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని జిల్లా కుష్టువ్యాధి నివారణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రం, బ్రోచెర్ లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ కుష్టువ్యాధిని సమాజం నుండి తరిమివేసి, జిల్లాను కుష్టువ్యాధి రహిత జిల్లాగా రూపొందించేందుకు ఈ నెల 15వ తేదీ నుండి డిసెంబర్, 5వ తేదీ వరకు ప్రతీ ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధి గుర్తింపు, నిర్ధారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే త్వరితగతిన వ్యాధి నుండి బయటపడడమే కాక ఇతరులకు వ్యాపించకుండా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. కుష్టువ్యాధిని మల్టీ డ్రగ్ థెరపీ విధానం ద్వారా పూర్తిగా నివారించన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఎం.డి.టి. మందులు పూర్తి ఉచితంగా లభిస్తాయన్నారు. వైద్యునిచే వ్యాధి నిర్ధారణ ఐన తరువాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండవ నెల నుండి ఏ .ఎన్ .ఎం. ద్వారా ఇంటి వద్దనే మందులు తీసుకుని క్రమం తప్పకుండా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రత్నకుమారి, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి, వైద్య సిబ్బంది వెంకట్, ప్రభృతులు పాల్గొన్నారు.

సమస్యలపై టీడీపీ అలుపెరుగని పోరాటం

విశాలాంధ్ర - మండపేట : సమస్యలపై టీడీపీ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల 13న మండపేటలో జోన్ 2 టిడిపి సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండపేటలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే

మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో జోన్ 2 సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. మండపేటలోని బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్లో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు, బండారు సత్యనారాయణమూర్తి తదితర నాయకులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ చేపడతామని వెల్లడించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పూజ

విశాలాంధ్ర - గండేపల్లి : మండల కేంద్రమైన గండేపల్లిలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం భారీ పూల అభిషేకం నిర్వహించారు. గ్రామంలోని సుమారుగా 80 మంది స్వాములు

మాలధారణ వేసి గ్రామమంతా తిరుగుతూ పేటతుళ్ళు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆహ్వానం చేసి వివిధ రకాల అభిషేకాలు అనంతరం భారీ పూల అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకానికి సుమారుగా ఒక టన్ను పువ్వులు వాడారు. స్వాములు రకరకాల పాటలతో ఉత్సాహంగా స్వామివారి పూజ నిర్వహించారు. గురుస్వాములు మేక సత్తిబాబు స్వామి, రామకృష్ణ స్వామి, కన్నబాబు స్వామి, రామన స్వామిలు ఆధ్వర్యంలో స్వాములంతా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పురోహితులు సత్తిబాబు వేదమంత్రాలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాలైన ఎన్‌టి రాజాపురం, రంగంపేట, రామయ్య పాలెం, సింగరంపాలెం, మురారి గ్రామాల్లోని స్వాములు మహిళలా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ అన్నదానం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయం వద్ద గురువారం భారీ

కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా ఆలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన ఈ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోట రవి, పలువురు నాయకులు పాల్గొని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా వడ్డన కార్యక్రమం నిర్వహించారు.

సోమేశ్వర ఆలయంలో అష్టోత్తర శత పూజలు

విశాలాంధ్ర - కలిదిండి: కార్తీక మాసం పురస్కరించుకొని కలిదిండి మండలంలోని కోరుకొల్లు కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి సన్నిధిలో గురువారం అష్టోత్తర శత పూజా

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 108 మంది దంపతులచే అష్టోత్తర శతకలన స్వపన పూజా కార్యక్రమం , శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి శాంతి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఆలయ అర్చకులు స్వర్ణ ఉమాశంకర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయన్నారు. భక్తులకి ఎటువంటి అసౌకర్యం తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఆలయ చైర్మన్ చెన్నంశెట్టిశ్రీనివాసరావు, చెన్నం శెట్టి కృష్ణ, ఆలయ ధర్మకర్తలు వలవల గంగరాజు, గోర్తి. వెంకట కృష్ణకుమారి, చీకటి. సరళీ, నాగసబోయిన. సుధారాణి, మామిడి శెట్టి. వెంకటసుబ్బారావు, తండు. అంజమ్మ, స్వర్ణ. వెంకటేశ్వర్లు తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుపతి శృంగార వల్లభ స్వామి హుండీ ఆదాయం రూ.14.44 లక్షలు

విశాలాంధ్ర - పెద్దాపురం : పెద్దాపురం మండలం తొలి తిరుపతి శృంగార వల్లభుడు ఆలయానికి హుండీల ద్వారా 14.44.296 రూపాయల ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ డిఈఓ. పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీ అధికారిగా సహాయక కమిషనర్ సిహెచ్ రామ్మోహనరావు పర్యవేక్షణలో గురువారం ఆలయం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ 62 రోజులు స్వామివారి హుండీల ద్వారా 14.44.296 రూపాయలు, అన్నదానం హుండీల ద్వారా 2.02.347 రూపాయలు ఆదాయం చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, కుంచే అమరావతితో పాటు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు(చిన్నా) ఆలయ సిబ్బంది, కాండ్రకోట గోదావరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్త మండలి సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

సీఎన్జీ సెగ్మెంటులోకి టయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర-రాజమండ్రి : తన కస్టమర్ ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా , టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) సీఎన్జీ సెగ్మెంట్లోకి ప్రవేశించినట్టు టీకేఎం సేల్స్ , స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ తెలిపారు. తద్వారా టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తుందన్నారు. కస్టమర్లు ఎంచుకోవడానికి ఎకో ఫ్రెండ్లీ , చౌకైన ఆప్షన్లను అందిస్తుందని, టయోటా ఎప్పుడూ కస్టమర్ల ఆకాంక్షలపై స్పష్టమైన దృష్టి సారిస్తుందన్నారు. తాము అత్యంత డిమాండ్ ఉన్న రెండు మోడళ్లు టయోటా గ్లాంజా , అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం సీఎన్జీ వేరియంట్లలో డ్రైవింగ్ అందిస్తున్నామని చెప్పారు.

పోతులూరులో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : వైసీపీ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ ధ్యేయంగా పరిపాలన అందిస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పోతులూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ బోండు రాంబాబు, మాజీ సర్పంచ్

పంచాది వీరబాబు, మాజీ ఎంపిటిసి నాగులపల్లి బాబ్జిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే 83వ రోజు నిర్వహించారు. ఎమ్మెల్యేను చీరల మీద నడిపించి పూలు వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందజేయాలన్నారు. ఈ ఎంపీపీ గోళ్ళ క్రాంతి సుధాకర్, వైసిపి మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైసిపి మండల పొలిటికల్ మేనేజర్ రామిశెట్టి చినబాబు, పోతులూరు వాకపల్లి ఎంపిటిసి ముప్పిడి ఏసుబాబు, సర్పంచ్ రోంగల నాగేశ్వరరావు, బారువాక సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, ఉప సర్పంచ్ బర్ల చక్రం, పినిశెట్టి ప్రకాష్, మామిడి నరసింహమూర్తి, బర్ల నాగరాజు, ఫిషరీస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, అధికారులు, పంచాయతీ వార్డు మెంబర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడి సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి ప్రధాన శాఖల అధికారులు డుమ్మా

విశాలాంధ్ర - కాజులూరు : కాజులూరు మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం జరిగిన మండల సర్వసభ్యసమావేశం సాదాసీదాగా జరిగింది. అయితే సభకు పలు ప్రధాన శాఖల అధికారులు డుమ్మా కొట్టడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వివరాల్లోనికి వెళ్లితే ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు వనం వెంకటసుసుబ్బారావు ముఖ్య అతిథిగా హజరవ్వగా ఎంపిడిఓ డివిఎస్ శర్మ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది 1545 ఇళ్లస్థల పట్టాలు పంపిణీ చెయ్యగా వాటిలో 1254 గృహనిర్మాణాలు మంజూరయ్యాయన్నారు. 327 నిర్మాణదశలో ఉండగా మరో 1927 ఇల్లు ప్రారంభం కావలసి ఉందన్నారు. అదేవిదంగా మండల ఇంజనీరింగ్ అధికారి మాట్లాడుతూ మండలంలో 1.30 కోట్లతో సీసీ రోడ్లు మంజూరుకాగా రూ. ఐదుకోట్లతో పలు గ్రామీణ రహదారులలో బీటి రోడ్లు మంజూయ్యాయన్నారు. ఆర్ డబ్ల్యుస్ ఏఈ మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా 23.96 కోట్లు మంజూరవ్వగా పనులు వేగవంతంగా జరుతున్నాయన్నారు. అయితే ప్రదానంగా వ్యవసాయశాఖ, డ్రెయిన్స్, రెవిన్యూ, నీటిపారుదల శాఖల నుంచి అధికారులేవ్వరూ సభకు హాజరుకాకపోవటంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. వ్యవసాయ ఆధారితమైన మండలంలో అందుకు అనుసందానమైన అధికారులు లేకపోతే తమ సమస్యలను ఎవ్వరికి చెప్పుకోవాలి అంటూ మతుకుమిల్లి సర్పంచ్ పెట్టా వీరనాయుడు, పల్లిపాలెం ఎంపీటీసి సభ్యులు మేడిశెట్టి శ్రీను తదితరులు వాపోయారు. ఎంపీడిఓ శర్మ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుసుబ్బారావులు స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సభ్యులకు శుక్రవారం మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూ వారిని శాంతిపజేసారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, మండలంలోని 26 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కొమ్మినేనికి అభినందనలు తెలిపిన దివి జర్నలిస్టులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యాలయం(విజయవాడ) లో నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కొమ్మినేని శ్రీనివాసరావుని దివిసీమ సీనియర్ జర్నలిస్ట్ లు గురువారం కలసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా కొమ్మినేని కి శుభాకాంక్షలు చెప్పి దుశ్శాలువలతో సత్కరించారు. ఆయనను కలసిన వారిలో సింహాద్రి కృష్ణప్రసాద్ అప్పికట్ల శ్రీనివాసరావు సామర్ల మల్లికార్జునరావు లేబాక నాగేశ్వరావు ఉన్నారు. కొమ్మినేని వారితో మాట్లాడుతూ జర్నలిస్టుల అందరి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. దివిసీమ పర్యటనకు రావాలని కొమ్మినేని ని ఆహ్వానించగా జర్నలిస్ట్ లకు ఉపయోగపడే మంచి కార్యక్రమం ఏర్పాటు చేయండి తప్పకుండా హాజరవుతానని సానుకూలంగా స్పందించారు.

స్వామిత్వా తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం!

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ రూపాలలో సేకరించటం ద్వారా మాత్రమే ఆయా గ్రామాలలో సమగ్ర అభివృద్ధి రూపకల్పన సాధ్యమౌతుందని ఎమ్.పి.డి.ఓ. శ్రీనివాస్ గురువారం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వామిత్వా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. తొలిదశలో ఆయా గ్రామాలకు చెందిన భూ ఉపరితలం పై డ్రోన్‌ల సహాయంతోనూ, రెండవ దశలో సరిహద్దుల నిర్ధారణ పైనా, మూడవ దశలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని ఎమ్.పి.డి.ఓ. తెలిపారు. గ్రామాలలో నివశిస్తున్న ప్రజల అవసరాలను గుర్తించేందుకు వారి వారి ఆర్థిక, జీవన విధానం, ఆరోగ్య స్థితి గతుల వంటి వాటిపై వివరాలను సేకరిస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్వేయర్‌తో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొంటారని శ్రీనివాస్ వివరించారు.

డా॥ విజయలక్ష్మికి బ్రౌన్ సాహితీ పురస్కారం

విశాలాంధ్ర - గుడివాడ : తెలుగు భాషాభివృద్ధికి ఆంధ్ర భాషోద్ధారకుడు, చార్లెస్ ఫిలిప్‌బ్రౌన్ చేసిన సేవలు చిరస్మరణీయమని రూరల్ ఎంపిపి గద్దె పుష్పరాణి అన్నారు. గురువారం స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయంలో తెలుగుబాషా సమితి అధ్వర్యంలో సిపి బ్రౌన్ 224వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి పుష్పరాణి మాట్లాడుతూ వేమన పద్యాలను ఆంగ్లభాషాలోకి అనువదించిన బ్రౌన్ తెలుగు భాషాకు ఎంతగానో కృషి చేశారన్నారు. అనతరం ప్రొఫసర్ డా॥ మండవ విజయలక్ష్మికి బ్రౌన్ 20222 సాహితీ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సమితి సమన్వయకర్త డిఆర్‌బి ప్రసాద్, గ్రంథాలయ అధికారిణీ కె.రామదేవి, సాహితీ వేత్తలు బివివి రమణ, డి.ఆనందమోహనబోసు, అవిరినేని వెంటేశ్వరరావు, సిహెచ్ శ్రీదేవి, ఆర్.వేణుబాబు, ఆర్‌కె రెడ్డి, నవీన్, సురేష్ మోహనబాబు, గ్రంథాలయ సిబ్బంది శాంతి, రవిచంద్ర, ప్రవల్లిక తదితరలు పాల్గొన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక 7వ వార్డులో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అధికార యంత్రాంగంతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు మహిళలు త్రాగునీరు, పెన్షన్లు, టిడ్కో గృహాలు, శానిటేషన్ తదితర సమస్యలను కొడాలి నాని దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం రూ.14లక్షలతో నిర్మించే సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, పలు శాఖల ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

స్థలంపై గద్దల కన్ను

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : స్థానిక ఇనగుదురుపేటలోని తన స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు రౌడీషీటర్ లు ప్రయత్నిస్తున్నారని మహ్మద్ అలీఖాన్ గురువారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తాతల ముత్తాతల వాసత్వానికి సంబంధించిన మా కుటుంబానికి చెందిన ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని మా కుటుంబాన్ని వీధిపాలు చేయాలని చూస్తున్నారని అలీ ఖాన్ ఆవేదన కన్నీటి పర్యంతమైంది. తనకుటుంబంలో ఆరుగురు సంతానంలో వికలాంగులైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, తన గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయం పై ఉన్నతాధికారులకు స్పందన కార్యక్రమం లో ఫిర్యాదు చేశానని, తనకు తన కుటుంబానికి న్యాయం చేయాలని మీడియా ముందు ఆయన విన్నవించారు. బిజెపి మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా భాయ్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకూ పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బాధితునికి వెంటనే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.